క్లుప్తంగా

కమిటీ ఎన్నిక



భూపాలపల్లి రూరల్: పెయింటర్స్ యూనియన్ భూపాలపల్లి పట్టణ నూతన కమిటీని జిల్లా కేంద్రంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కీర్తి రాజమౌళి, ఉపాధ్యక్షులుగా ఎర్ర విజయ్, నోముల రఘు, ప్రధాన కార్యదర్శులుగా తోటకూరి గణేశ్, అరికెల్ల శ్యామ్, కోశాధికారులుగా గుగులోతు రమేశ్, అక్కపెల్లి సంపత్, సలహాదారులుగా కుక్క శ్రీనివాస్, గాలిపెల్లి గట్టయ్య, రమేశ్, సహాయ కార్యదర్శులుగా అతుక్కూరి మల్లేశ్, జంగిలి ప్రమోద్, ప్రచార కార్యదర్శులుగా అమృత అశోక్, సభ్యులుగా సెగ్గం దశరథం, రామకృష్ణ, పాలడుగుల ప్రవీణ్ ఎన్నికయ్యారు.

బియ్యం అందజేత

టేకుమట్ల: మండలంలోని సోమనపల్లి గ్రామానికి చెందిన మారెపెల్లి రాజకొమురయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ ఉద్దమారి మహేష్‌యాదవ్ పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. ఆయన వెంట రాం దేవేందర్, పోశాలు, రవికుమార్, భిక్షపతి, రాజయ్య, సంపత్, రాజయ్య, రామస్వామి, రవి, రాజపోశాలు, చిన్నకొమురు, మహేందర్, తదితరులు ఉన్నారు.

గడువు పొడిగించాలి

నల్లబెల్లి : తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో మొండి బకాయిలను తగ్గించేందుకు ప్రభుత్వం కల్పించిన వన్‌టైం సెటిల్‌మెంట్ గడువును ఈ నెల 15 వరకు పొడిగించాలని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సలీంకు శనివారం వినతిపత్రాన్ని అందించారు. ఆయన వెంట సురేష్ తదితరులు ఉన్నారు

ట్రాక్టర్ కిస్తీలు చెల్లించలేక.. ఆత్మహత్యాయత్నం..

- చికిత్స పొందుతున్న యువకుడి మృతి



శ్రావణ్ కుమార్ (ఫైల్)

రేగొండ : ట్రాక్టర్ కిస్తీలు చెల్లించలేక.. ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం .. మండలంలోని రాయపల్లి గ్రామానికి చెందిన ల్యాదెల శ్రావణ్ కుమార్ (22) ట్రాక్టర్ కిస్తీలు చెల్లించే స్థోమత లేక ఆర్థిక ఇబ్బందులతో గత నెల 10న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యంకోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



విజయ్ (ఫైల్)

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన యువకుడు సూరం విజయ్ (21) ఇంట్లో ఉరేసుకొని శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయ్ ఇంటర్మీడియట్ పూర్తిచేసి, ఇంటివద్దే ఖాళీగా ఉంటున్నాడు. దీంతో చదువుకోవాలని కుటుంబసభ్యులు ఒత్తిడి తీసుకురావడంతో మనస్తాపానికి గురయ్యాడు. తల్లిదండ్రులు పొలం పనికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

నీరు తోడేందుకు వెళ్లి.. బావిలో పడి..

- ఆర్టీసీ ఉద్యోగి మృతి
- మృతిపై పలు అనుమానాలు?

గణపురం : మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి పుప్పాల రవి (50)బావిలో పడి శనివారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రాత్రి భోజనం చేసి చేతులు శుభ్రం చేసుకోవడానికి రవి బావి వద్దకు వెళ్లి బకెట్‌తో నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడని, ఎంతకు ఇంట్లోకి రాకపోవడంతో వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. అయితే రవి మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లోని చేద బావి పెద్దగా లోతు లేకపోడంతో పాటు ప్రమాదవశాత్తు బావిలో పడిన దిగడానికి ఏర్పాటు చేసిన ఇనుప కొండ్లు ఉన్నాయి. రవి వాటిని పట్టుకున్న బతక వచ్చని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. రవి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడా? మరేమైన కారణమా అని పలువురు చర్చించుకుంటున్నారు. మృతుడు పరకాల ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిరుపయోగంగా ‘ఎత్తిపోతల’

- మోటార్లు మూలనపడి 19 ఏళ్లు
- పట్టించుకోని అధికారులు



పనిచేయని ఎత్తిపోతల పథకం

వాజేడు: గిరిజన రైతులకు సాగు నీటిని అందించేందుకు మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పూసురు గోదావరి ఒడ్డున ఎత్తిపోతల పథకం నిర్మించారు. పూసూరుతో పాటు మరో నాలుగు గ్రామాలకు చెందిన 354 మంది రైతులకు సంబంధించిన 706 ఎకరాల భూమి సాగుకు ఉపయోగ పడే విధంగా ఈ ఎత్తిపోతల పథకాన్ని 1992లో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టి 1993లో పూర్తి చేశారు. ఈ లిఫ్టుకు 100 హెచ్‌పీ మోటార్లు మూడు అమర్చి పైపులైన్, విద్యుత్ లైను ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు.

ఒడిదొడుకులతో 2005 వరకు..

ఈ పథకం ప్రారంభించక మూడు ఏళ్ల పాటు సక్రమంగా సాగు నీరు అందించి రైతుల పాలిట వరంగా మారింది. అనంతరం పైపులైన్ మరమ్మతులకు గురి కావడంతో నాసిరకం పైప్ లైన్ వేశారని రైతులు అప్పుడే ఆందోళనలకు దిగారు. ఆ ఏడాది పైపులైను పగిలి పోయిన కారణంగా రైతుల వరి పంట ఎండిపోయింది. సాగు నీటికి రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. కాగా, అప్పటి భద్రాచలం సబ్‌కలెక్టర్ నీతూ ప్రసాద్ ప్రత్యేక శ్రద్ధ వహించి మోటార్లను బాగు చేయించారు. అదే సమయంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలనే కారణంతో విద్యుత్ సిబ్బంది సరఫరాను నిలిపి వేశారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి రూ.12 లక్షల విద్యుత్ బిల్లులను మాఫీ చేశారు. కొద్ది రోజులు పని చేసిన ఎత్తిపోతల పథకం మూడు మోటర్లు మరమ్మత్తులకు గురి కావడంతో మూలన పడింది. 1992 వ సంవత్సరంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం ఒడిదొడుకులతో 2005 వరకు నడిచింది. ఆ తర్వాత దానిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నాంది ఫౌండేషన్ వారు దత్తత తీసుకుని దీనిని మరమ్మతులు చేస్తామని ప్రకటించి అర్ధాంతరంగా వదిలి వెళ్లిపోవడంతో ఈ పథకం అలంకార ప్రాయంగా మిగిలిపోయింది. మధ్యలో ఐటీడీఏ ద్వారా మరమ్మతులు చేస్తామని అధికారులు తెలిపినప్పటికీ చేయలేదని ఎత్తిపోతల పథకం ఆయకట్టు చైర్మన్ ముత్తయ్య తెలిపారు. అధికారులు లిఫ్టును మరమ్మతులు చేసి నాణ్యమైన పైపులైన్ వేసినట్లైతే తమ పంటలకు నీరు వచ్చేదని రైతులు వాపోతున్నారు. ఈ ఎత్తిపోతల పథకం పని చేయక పోవటంతో పంటలు పండక అప్పులపాలు అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఎత్తిపోతల పథకంను మరమ్మతు చేయించి ఆదుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్లు లేకుండా మిగిలిన స్తంభాలు



సిబ్బంది కోసం నిర్మించిన గదులు

మరమ్మతు చేయించాలి



నాకు పూసూరులో 10 ఎకరాల సాగు భూమి ఉంది. ఎత్తిపోతల పథకం పని చేసినప్పుడు పంట మంచిగా పండేది. ఇప్పుడు వర్షం పడితే పండుతోంది లేకపోతే ఎండుతోంది. ఎత్తిపోతల పథకాన్ని అధికారులు మరమ్మతు చేయించాలి. ఈ ఎత్తిపోతల పథకం కింద సుమారుగా 350 వరకు రైతులం ఉన్నాం.

– తోలెం ముత్తయ్య, రైతు

బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న పూజారులు

మంగపేట: మండలంలోని నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురూజీ సంజీవ్ కుమార్ సిద్ధాంతి, గ్రామ పెద్దలు రవీందర్, తోలెం వెంకన్న, తాటి నాగరాజు, కృష్ణ, నరేందర్, తిరుమల రావు, నరేందర్, వాసం ఈశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

- తహసీల్దార్ శ్రీనివాసులు



మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

భూపాలపల్లి అర్బన్: మీ సేవ కేంద్రాల ద్వారా అందించే సేవలకు నిర్దేశించిన రుసుం కంటే అదనంగా తీసుకుంటే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసులు, ఈడీఎం శ్రీకాంత్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని మీ సేవ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సేవల అందుబాటు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని నిర్వాహకులకు సూచించారు. మీ సేవ కేంద్రాల ద్వారా అందించే సేవలకు సంబంధించి ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



చిన్నయ్య దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సింగరేణి కమ్యూనిటీ హాల్లో జిల్లా సంక్షేమ అధికారిగా పని చేసిన కొట్టే చిన్నయ్య పదవీ విరమణ మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నయ్య దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డీడబ్ల్యూఓగా చిన్నయ్య జిల్లాకు రెండు పర్యాయులుగా అనేక సేవలు చేశాడన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పీసీసీ సభ్యులు చల్లూరి మధు, పార్టీ నాయకులు మహేందర్, బీతి పృధ్వీ, టీఎన్జీవో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి, వర్ధమాన కవి గాయకుడు బహుజనవాది మచ్చ దేవేందర్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి, ఐసీడీఎస్ అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్, విజ్ఞాన కేంద్రాల సందర్శన



జూ పార్కు వద్ద విద్యార్థులు

మల్హర్: సైన్స్, విజ్ఞాన కేంద్రాల ప్రదర్శనలో భాగంగా మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రిన్స్‌పాల్ పూర్ణచందర్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని నెహ్రూ జువాలజికల్ పార్కు, సైన్స్ ప్రదర్శనశాల, వరంగల్‌లోని స్థలాలను, ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పూర్ణచందర్ మాట్లాడుతూ.. ఇలాంటి విజ్ఞాన కేంద్రాలను సందర్శించడం వల్ల విద్యార్థులకు సజనాత్మకత భావం పెరుగుతుందని అన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు

చిట్యాల: విద్యార్థినులు చదివేటప్పుడు మానసిక ఒత్తిడికి గురికావద్దని ఒడితల పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మానసిక ఒత్తిడి, ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మౌనిక హాజరై మాట్లాడుతూ.. విద్యార్థినులు శారీరకంగా దృఢంగా ఉండాలని అన్నారు. రానున్న పరీక్షలలో ఏలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర హాస్టళ్ల కన్వీనర్ వెల్పుల రాజ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి సంజీవరెడ్డి, నగర కార్యదర్శి బుర్ర అభిగ్న, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని జోహార్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు గ్రామానికి చెందిన గొట్టిముక్కుల సదానందం నోట్‌బుక్స్, కంపాక్స్, స్లేట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జాహీద్, ప్రధానోపాధ్యాయురాలు రేష్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పరామర్శ

ఏటూరునాగారం: మండలంలోని బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు నాయకులతో కలిసి శనివారం పరామర్శించారు. తాడూరి రఘు, వలిబాబా, కాకులమర్రి ప్రదీప్‌రావు, కురుమ శ్రీను, అత్కూరి రాంబాబు, కొండగొర్ల తిరుపతి, గట్టు నర్సింహులు, జిట్టా ఈశ్వర్, రమేశ్, అల్లంల బుచ్చయ్య, అజహర్‌పాషా, లక్ష్మణ్ ఉన్నారు.

వీధిదీపాల ఏర్పాటు

వాజేడు: మండల కేంద్రంలో శనివారం వీధి దీపాలను ఏర్పాటు చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలో త్రీ ఫేజ్ విద్యుత్ లైన్‌ను విద్యుత్ శాఖ సిబ్బంది వేశారు. దీంతో పలు చోట్ల వీధిలైట్లు లేకపోవడంతో పంచాయతీ సిబ్బంది వేశారు.

మానేరులో ప్రైవేట్ టోల్ రద్దు



ప్రైవేట్ టోల్‌ను తొలగిస్తున్న అధికారులు

టేకుమట్ల: మండలంలోని కలికోట శివారు మానేరులో వాహనదారుల సౌకర్యార్థం ముత్తారం మండలం ఓడేడ్, మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామస్తులు తాత్కాలిక మట్టి రోడ్డును నిర్మించి రెండు నెలలుగా మట్టి రోడ్డు గుండా ప్రయాణించే వాహనాలపై కొంత రుసుంను వసూలు చేస్తున్నారు. దీంతో మానేరులో అక్రమంగా టోల్ టాక్స్ వసూలు చేస్తున్నారని కొంత మంది అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ముత్తారం మండలంలోని అధికారులతో పాటు, టేకుమట్ల మండల రెవెన్యూ అధికారులు శనివారం టోల్ వసూల్‌ను రద్దు చేశారు. మానేరులో వంతెన నిర్మాణం నిలిచిపోవడంతో వాహనదారుల సౌకర్యార్థం కొన్ని సంవత్సరాలుగా తాత్కాలిక మట్టి రోడ్డును ఇరుగ్రామాల ప్రజలు నిర్మించి కొంత రుసుంను వసూలు చేస్తున్నారు. కాగా, ప్రస్తుతం కొంత మంది టోల్ నిర్వాహకులను డబ్బులు డిమాండ్ చేస్తూ ఇవ్వకపోవడంతో కావాలనే కక్షతో అధికారులను ఉసిగొల్పారని ప్రచారం కొనసాగుతుంది. ఏది ఏమైనా మానేరులో రోడ్డును తొలగిస్తే ఓడేడ్ నుంచి ప్రయాణించే వాహనదారులు మరో 50కిలో మీటర్ల దూరం అధికంగా ప్రయాణించాల్సిందే.

మిత్రుడి కుటుంబాలకు చేయూత

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన వీణవంక రాజు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో రాజుతో కలిసి చదువుకున్న 2003–04 పదో తరగతి చిన్ననాటి మిత్రులు రూ.15000 ఆర్థిక సాయం శుక్రవారం అందించారు. దాన బోయిన రాములు, వడ్లకొండ నాగార్జున గౌడ్, మధారపు ఓదెలు, రాజు, ఆరిఫ్ పాషా, వేణవంక సునీల్, శాంతికుమార్, బొల్లం సుమన్, నూనె కిరణ్, విజేందర్, దీపిక, శ్వేత, మానస, ఝాన్సీ తదితరులు ఉన్నారు.

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బోయిని సదానందం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మృతుడి స్నేహితులు పరామర్శించి రూ.17300 నగదును అందజేశారు. కట్కూరి నరేందర్, గంగాధారి రాజు, కొంక అశోక్, మేడిపల్లి శ్రీనివాస్, రాజేందర్, గుండా సురేష్, లాండే శివాజీ, సతీష్, రాజేందర్, సంతోష్, రవికుమార్, నందకుమార్ తదితరులు ఉన్నారు.

సాగునీరు అందించడమే లక్ష్యం

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్



రైతులతో మాట్లాడుతున్న రవిచందర్

ములుగు రూరల్: సాగు చేసే ప్రతీ ఎకరాకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. మండలంలోని పత్తిపల్లి గ్రామం ఏదర్ల చెరువు ఆయకట్టు, రంగాయ చెరువు ఆయకట్టు రైతులతో ఆయన శనివారం మాట్లాడారు. యాసంగి పంట పండించడానికి నీరు సరిపోవడం లేదని ఇటీవల మంత్రి సీతక్కకు విన్నవించినట్లు తెలిపారు. దీంతో కలెక్టర్, ఇరిగేషన్, తహసీల్దార్‌తో మాట్లాడి రైతులకు కావాల్సిన నీరు అందించడానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, రమేష్, భిక్షపతి, లక్కీ, సారయ్య పాల్గొన్నారు.

సైన్స్‌తోనే విద్యార్థుల్లో మేధాశక్తి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రవీందర్

ములుగు రూరల్: సైన్స్‌తోనే విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని ప్రొఫెసర్లు రవీందర్, కిషన్, రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై సైన్స్ ఎగ్జిబిట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ పిచ్చిరెడ్డి, అధ్యాపకులు సురేష్ బాబు, రామ్‌రెడ్డి, యాదగిరి, రామచంద్రం, వెంకట్‌రెడ్డి, బ్రహ్మచారి, సదయ్య, రజిని, మమత, దయానంద్, పుల్లయ్య, ముఖేష్, చంద్రమౌళి, డాక్టర్ రాములు పాల్గొన్నారు.

పింఛన్ డబ్బులు పూర్తిస్థాయిలో చెల్లించాలి

ములుగు రూరల్: మండలంలోని రాయినిగూడెం పోస్టాఫీస్ పరిధిలో పింఛన్‌దారులకు పూర్తిస్థాయి డబ్బులు చెల్లించాలని సీపీఎం నాయకుడు గుండబోయిన రవిగౌడ్ డిమాండ్ చేశారు. పింఛన్ డబ్బులు పూర్తిగా చెల్లించని బీపీఎంపై చర్య తీసుకోవాలని శనివారం పోస్టాఫీస్ ఎదురుగా పింఛన్‌దారులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయినిగూడెం, కొత్తూరు, పంచోత్కులపల్లి గ్రామాల్లో వృద్ధులకు రూ.2016, దివ్యాంగులకు రూ.3016 చెల్లించాల్సి ఉండగా ఆరు నెలలుగా వారికి రూ.16 చెల్లించకుండా కేవలం రూ.2000, రూ.3000 ఇస్తు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అన్నారు. పూర్తిస్థాయి డబ్బులను చెల్లించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండమీది వెంకటేశ్వర్లు, గొంది కాంత, తవిటి లక్ష్మి, సంజాన, రామారావు, మొగిలి, లింగారావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

- ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

భూపాలపల్లి రూరల్: పర్యావరణ పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిదని ప్రధానోపాధ్యాయుడు మండల రవీందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఆధ్వర్యంలో తడినేలల పరిరక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గొల్లబుద్దారం చౌరస్తాలో ఉపాధ్యాయులు, విద్యార్థులంతా కలిసి మానవహారంగా ఏర్పడి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛమైన గాలి, నీరు, మంచి ప్రకృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉన్నదని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి, మొక్కల పెంపకాన్ని చేపట్టాలన్నారు. అదే విధంగా నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

మొగుళ్లపల్లి: అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన మండల కేంద్రానికి చెందిన రైతు అరికాంతపు రాజు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి ఆయన పరామర్శించారు. రాజు కుటుంబ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ పంటలకు పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక రైతు రాజు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ప్రభుత్వం పాలకులు ఆదుకున్న పాపాన పోకపోవడం దురదృష్టకరమన్నారు. కొడారి రమేశ్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు గుడిమల్ల రమేశ్, ప్రధాన కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షులు రంపిస రాజేందర్, లీడర్లు బొల్లెని రవికుమార్, బండారి భిక్షపతి, పడిదల జగ్గారావు, మోడె రాజు, వనం రాజయ్య, అరికాంతపు అన్నారెడ్డి, దేవనూరి కుమార్ తదితరులు ఉన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది



ఏటూరునాగారం: నినాదాలు చేస్తున్న నాయకులు



గోవిందరావుపేట: పస్రాలో..

ఎస్సీ వర్గీకరణ ఉద్యమ పోరాటంలో భాగంగా ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగం మరువలేనిది ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో శనివారం మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. అమరుల స్ఫూర్తిగా వర్గీకరణ సాధించే వరకూ పోరాటాలను సాగించాలని అన్నారు.

-సాక్షి నెట్‌వర్క్



వెంకటాపురం(ఎం): అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వాజేడులో..



మంగపేటలో..